
మినీ కథ

# ఆత్మశాంతి

**"విజయా! అమ్మ సంవత్సరీకం దగ్గరకొచ్చేసింది. మరో మూడు రోజులే వుంది. బంధువులందరికీ పిలుపులు వెళ్లాయి. అమ్మకి సొజ్జప్పాలంటే ఇష్టం. పరమాన్నం ఇష్టం. కొబ్బరి పచ్చడి ఇష్టం. అమ్మకిష్టమైనవన్నీ చేయించుదాం. వచ్చిన వాళ్ళు తృప్తిగా తింటే అమ్మ ఆత్మ శాంతిస్తుంది'' తండ్రి మాటలు వింటూంటే విజయ మనసులో మెలితిప్పినట్టుగా అయింది! 'ఇది' అని చెప్పలేని బాధ గుండెలోంచి తన్నుకొచ్చింది.**

"ఏమిటమ్మా ఆలోచిస్తున్నావు? ఇంకా ఏం చేయిస్తే బాగుంటుందనా? చెప్పమ్మా. కూరలు, పచ్చళ్లు, పిండి వంటలు అందరూ మెచ్చుకునేలా శుభ్రంగా, కమ్మగా వండమని వంటవాళ్లకి చెప్పాను. ఎలాంటి లోటు రాకుండా ఈ కార్యక్రమం జరిపించాలి కదా. అప్పుడే అమ్మ ఆత్మ శాంతిస్తుంది'' అంటున్న తండ్రివైపు ఒక్కక్షణం చూసి తలదించుకుంది విజయ.

"అమ్మ... అమ్మ... అమ్మ ఆత్మకి శాంతి! అమ్మకిష్టమైనవన్నీ చేయిస్తార్ట! అయ్యో! అమ్మా! ఎక్కడున్నావు? ఏ లోకంలో వున్నావు? భర్త పెట్టే బాధల్ని భరిస్తూ, భర్త నిరసనని, నిర్లక్ష్యాన్ని గుండె గుప్పెట్లో దాచుకుంటూ ఈ భూమ్మీదే నరకాన్ని చూసి వెళ్లిపోయావు కదమ్మా!? ఇంకా స్వర్గ నరకాలు ఎక్కడో వున్నాయంటావా? ఉత్త భ్రమ! ఇదంతా మనల్ని మనం మోసం చేసుకోవడం కాకపోతే మరేమిటి?'' "సుభద్రా! ఎందుకు పడుకున్నావు? ఒంట్లో బాగాలేదా? డాక్టర్ని పిలవమంటావా? జాగ్రత్త, పన్లేమీ చెయ్యకు, రెస్టు తీసుకో'' అని దగ్గర కూర్చుని ఆప్యాయంగా నాన్న నీతో మాట్లాడిన క్షణం నీ జీవితంలో వుందా అమ్మా?! లేదు. అంతటి ఆప్యాయతలే వుంటే నువ్వీ విధంగా చనిపోయి వుండవు! రోగంతో మంచం మీద పడివున్న నీకు నాన్న కసుర్లు, విసుర్లు తప్ప ఏం దొరికిందని!? రోజూ పేకాటలో డబ్బు పోగొట్టుకుని ఏ అర్ధరాత్రో ఇల్లు చేరి డబ్బు పోయిన కోపం అంతా నీ మీద చూపించినప్పుడు గుడ్ల నీరు కుక్కుకుని ఏడ్చిన రోజులు ఎన్నిలేవు? ఇంట్లో బియ్యం, పప్పులు కొనడానికి డబ్బుల్లేవని అడిగితే ఎంత ఎత్తున ఎగిరేవాడు నాన్నా?!



"ఎంత తెచ్చిపోసినా నీకూ, పిల్లలకి తిండికే చాలదే! డబ్బేం తేరగా వస్తుందనుకున్నావా? వంట అవకపోతే లేదు. నన్నేం బెదిరిస్తున్నావా? ఇలాంటి బెదిరింపులు నా దగ్గర పనిచెయ్యవు. నువ్వు ఎలా చస్తే అలా చావు! ప్రతీదానికీ వెధవ ఏడుపు ఒకటి? నీ దరిద్రగొట్టు ఏడుపు వల్లే ఈ ఇంటికి దరిద్రం పట్టుకుందే, నువ్వు చస్తేగాని ఇల్లు బాగుపడదు! నువ్వూ, పిల్లలు ఎలా ఏడిస్తే అలా ఏడవండి. నేను హోటల్లో తినేసి ఆఫీసుకి పోతాను!'' అనేసి విసురుగా వెళ్లిపోయిన నాన్న!! ఆలికి అన్నం పెడితే వూరికి వుపకారం అన్నట్టు ప్రవర్తించే నాన్న!! నువ్వు వున్నన్నాళ్లు నీ మనసుని ముక్కలుముక్కలు చేసిన నాన్న!!... ఈరోజు నీ ఆత్మశాంతికి భారీ ఎత్తున ఖర్చుపెడుతూ ఊరందర్నీ భోజనాలకి పిల్చి ఇంత హడావుడి చేస్తున్నారంటే... ఎందుకు? ఆహా! ఓహో! ఆయనకి పెళ్లాం అంటే ఎంత అభిమానం? ఎంత ప్రేమ! పెళ్లాం చచ్చిపోయి మరో లోకంలో వున్నాకూడా ఆవిడ ఆత్మ శాంతి కోసం ఇంత ఆర్భాటంగా అన్నీ చేయిస్తున్నాడూ అంటే మెచ్చుకోతగ్గ విషయమే!'' అని వచ్చిన వాళ్లందరూ భర్త తను చచ్చిపోయాక సంతర్పణ చేయిస్తున్నాడూ... అంటే ఏ భార్య ఆత్మ శాంతిస్తుంది?!!''
విరక్తిగా అనుకుంది విజయ.

**- న్యాయపతి కమలారాంజీ**